
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | ఫిబ్రవరి 11, 2025 | www.navatelangana.com

కొనసాగుతున్న నిజాంసాగర్ నీటి విడుదల



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి యాసంగి పంట సాగు కోసం మూడో విడత నీటిని సోమవారం మధ్యాహ్నం నుండి నీటి విడుదలను కొనసాగిస్తున్నట్లు ప్రాజెక్ట్ ఏఈఈ శివ సోమవారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ప్రధాన కాలువలో ఒకరు పడి చనిపోగా మృతదేహన్ని వెలికితీయడం కోసం నీటిని నిలిపివేయడంతో సోమవారం మృతదేహం లభ్యం కావడంతో తిరిగి మూడో విడత నీటిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటిని వృథాగా పోనివ్వకుండా రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. 1500 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నామని, కావున ప్రధాన కాలువ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాలువలోకి ఎవరూ దిగొద్దు అని సూచించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 11.489 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మంజూరైన నిధులు విడుదల చేయాలి

- నేడు ధర్నా : కాంగ్రెస్ నాయకులు యలమంచలి శ్రీనివాస్‌రావు



నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్టీ మారిన అని చెపుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి.. రాష్ట్ర ఇంచార్జి జూపల్లి కృష్ణరావు అభివృద్ధి కోసం ప్రొసీడింగ్ ఇచ్చిన రూ.6 కోట్ల నిధులు ఆపి వేయించారని మాజీ ఎంపీటీసీ ల ఫోరమ్ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ రావు ఆరోపించారు. నిధులు విడుదల కోసం మంగళవారం మోస్రా ఎక్స్ రోడ్డు వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధర్నాకు కార్యకర్తలు అధిక సంఖ్యలో మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘ అధ్యక్షులు ముత్యాల కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి రాంబాబు, మొయిద్దీన్, కొల్లిపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, జంపాల నాగరాజు, కిసాన్ కేత్ అధ్యక్షులు గంగప్ప తదితరులు ఉన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే

'ప్రత్యేక పాలన'కు 12 నెలలు

- సర్పంచ్‌లు లేక వెలవెలబోతున్న గ్రామాలు
- నిధుల్లేక కుంటుపడుతున్న అభివృద్ధి
- పట్టించుకోని ఇన్‌చార్జీలు
- నలిగిపోతున్న కార్యదర్శులు

గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించి 12 నెలలు అవుతుంది. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు కనిపించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. జీపీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. ప్రత్యేకాధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుండటంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చిన ప్రత్యేక అధికారులు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనితో సమస్యలు వెక్కిరిస్తున్నాయి.



బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ మండలంలో 25, బీర్కూర్‌లో 13, నసురుల్లాబాద్ లో 17 గ్రామాలు ఉండగా, ఇన్ ఛార్జ్ పాలనతో గ్రామ పంచాయతీల్లో సమస్యలు తిష్టవేశాయి. 3 మండలాల పరిధిలో 55 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరి 1వ తేదీన పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. 2వ తేదీన గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. మండలాలు, గ్రామాలకు దాదాపు గెజిటెడ్ అధికారులనే ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఏడాదిగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండటంతో గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో సమస్యలు పేరుకుపోయి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత డిసెంబర్ వరకు ఇంటి పన్నుల వసూళ్లతోనే పంచాయతీల పరిపాలన కొనసాగింది. కార్మికుల వేతనాలు సైతం పన్నుల వసూళ్లతోనే చెల్లించారు. జనవరి నుంచి ప్రభుత్వం నేరుగా కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తోంది. పన్నుల రూపంలో వచ్చిన నిధులతోనే జీపీల్లోని పారిశుధ్య పనులు, క్లోరినేషన్, వీధిలైట్లు, ఇతర పనులు చేస్తున్నారు.

పట్టించుకోని ఇన్ ఛార్జ్ లు

ఇన్‌చార్జీ అధికారులు పంచాయతీ బాధ్యతలను స్వీకరించిన జీపీలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క రోజు కూడా గ్రామాలను తనిఖీ చేయలేదనే గుసగుస వినిపిస్తోంది. గ్రామాల స్థితిగతులు, అభివృద్ధి, పన్నుల వసూలు లాంటి వ్యవహారాలను పట్టించుకోకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి పంచాయతీ ఎన్నిక ఏర్పాట్లనైనా సరిగా చేస్తారో..? లేదో..? వేచి చూడాలి.

త్వరలో ఎన్నికలు..

ఈ నెలాఖరులోగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐదేండ్లకోసారి ప్రభుత్వం గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాలకవర్గాల గడువుకు ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. పంచాయతీ పాలక వర్గాల గడువు ముగింపునకు రెండు నెలల ముందే రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది. దీంతో అప్పటికప్పుడు జీపీ ఎన్నికల నిర్వహణ అసాధ్యమని తాత్కాలికంగా వాయిదా వేసి ప్రభుత్వం, ప్రత్యేకాధికారులను నియమించింది. 6 నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా మరో 6 నెలలపాటు ప్రత్యేక పాలనను పొడిగించింది. ప్రస్తుతం ఏడాది పూర్తయి ఇటీవలే ప్రభుత్వం నుంచి జీపీ ఎన్నికలపై



స్పష్టత వచ్చింది. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల పాలన గతేడాది జూలైలో ముగిసింది. గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పాలన లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రత్యేకాధికారుల నిర్లక్ష్యం మూలంగా అందకుండా పోతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

రూ. కోట్లలో బకాయిలు

గ్రామ పంచాయతీలకు సుమారు రూ.కోట్లలో బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు, పారిశుధ్య పనుల నిర్వహణ లాంటి పనులను జీపి కార్యదర్శులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు చేపట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అవుతాయనే ఆశతో గ్రామాల్లో పనులు చేయగా ఏడాది దాటినా నేటికీ వారికి బిల్లుల చెల్లింపు జరగలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు వడ్డీకి తీసుకొచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే ఇప్పటి వరకు బిల్లులు రాలేదని వాపోతున్నారు. ప్రభుత్వం. తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

ఆశావహుల ఎదురుచూపు



జీపీ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ఏర్పాట్లకు అధికార యంత్రాంగం సన్నద్ధమై ఉంది. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా ప్రకటించి బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. సర్పంచ్ అభ్యర్థుల గుర్తులను సైతం కేటాయించి బ్యాలెట్ పేపర్లను ముద్రించారు. ఫిబ్రవరి చివరి వారంలోపు ఎన్నికలు ఉంటాయని భావిస్తున్నప్పటికీ బీసీ రిజర్వేషన్లపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నట్లు సమాచారం. మార్చి, ఏప్రిల్ నెలలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఉండటంతో ఎన్నికలకు ప్రభుత్వం మొగ్గుచూపక పోవచ్చని అధికారులు చర్చించుకుంటున్నారు. జీపీ ఎన్నికల ముందే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

కులవివక్షకు పాల్పడితే 24 గంటల్లో రిమాండ్ చేయాలి

- ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య



వెంకటయ్యను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

కుల వివక్ష చూపి ఆలయం నుండి గెంటివేసిన నిందితున్ని 24 గంటల్లోగా అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య ఆదేశించారు. ఈనెల 4వ తేదీనా జరిగిన మల్లికార్జున ఉత్సవాల్లో పాల్గొని ఆలయంలో భజన చేపడుతున్న కూరల రమేష్‌ను అగ్గి లాంటి దేవుడు మీరు ఇక్కడ ఉండకూడదు అంటూ వివక్షకు పాల్పడ్డ చిన్న గొల్ల సాయిలును తక్షణమే అరెస్టు చేయాలని అన్నారు.

వివరాలు మెయిన్‌లో..

కులగణన బోగస్ సర్వే

- ఎంపీ అరవింద్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం చేయించిన కులగణన అంతా బోగస్ సర్వే అని ఎంపీ అరవింద్ అన్నారు. లెక్కలను అధికారికంగా ప్రకటిస్తే.. గంటలోనే తప్పుని నిరూపిస్తా అని అన్నారు. సోమవారం ఆయన విడియో రిలీజ్ చేశారు. కేసీఆర్ కులం పెద్దదని ఆయనను సీఎం చేయలేదని, తెలంగాణ కోసం కొట్లాడారని ప్రజలు ఆయనకు ఓట్లేశారని అన్నారు. ఆయన పదేళ్ల పాలన, ఆయన పిల్లల గుణం బాగోలేదనే ఆ తరువాత ప్రజలు ఓడించారన్నారు. రాజకీయాల్లో కులం కన్నా గుణం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులాల వారీగా నంబర్లను అధికారికంగా విడుదల చేయకముందే లీకులు ఇస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి లీకులు ఇస్తున్నారా..? లేక కాంగ్రెస్ తో కలిసి కేసీఆర్ లీకులు చేయిస్తున్నారా..? అని ప్రశ్నించారు. వారు ఇస్తున్న లీకుల బుట్టలో బీజేపీ వాళ్లు పడుతున్నారని, తెలిసి పడుతున్నారా...? లేక తెలియక పడుతున్నారా...? అని అన్నారు. సీఎం చెప్పిన ప్రకారం రాష్ట్ర జనాభా 3,54,75,554 మంది ఉన్నారని, అయితే రాష్ట్రంలో ఓటర్ల సంఖ్యనే 3,35,27,925 మంది ఉన్నారన్నారు. వారి లెక్కల ప్రకారమే సుమారు 19 నుంచి 20లక్షల మంది నాన్ ఓటర్లు ఉన్నారని, ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్ ప్రకారం 0 నుంచి 6 ఏళ్ల వయస్సు వారు 39 లక్షల మంది ఉన్నారని తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసుకున్న విద్యార్థి మృతి

- చదువుపై విరక్తితో పురుగుల మందు సేవించిన విద్యార్థి



మృతి చెందిన అభిషేక్

నవతెలంగాణ-నవీపేట్

చదువుపై విరక్తి చెంది ఓ విద్యార్థి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసుకోగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని అబ్బాపూర్(బి) గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అబ్బాపూర్ (బి) గ్రామానికి చెందిన అభిషేక్ (17) ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయ్యాడు. దీంతో మళ్లీ మొదటి సంవత్సరంలోనే చదివించగా చదువుపై విరక్తి చెంది జనవరి 27వ తేదీన గుర్తుతెలియని పురుగుల మందు సేవించగా వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబీకులు నిజామాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఈనెల 7వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి తండ్రి కళ్లెం సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ కుమార్ సోమవారం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంచారజాతుల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

నల్లవెల్లి వీడీసీ నుంచి ఓడ్ కుల

కుటుంబానికి రక్షణ కల్పించాలి

- సంచారజాతుల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తిప్పిరి శెట్టి శ్రీనివాస్, జాదవ్‌శరత్
- ట్రాక్టర్‌తో దౌర్జన్యంగా ఇంటిని కూల్చివేస్తే ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవట్లేదని ఆవేదన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇందల్‌వాయి మండలం నల్లవెల్లిలో సంచార ఓడ్ కుల కుటుంబ నివాస గృహాన్ని విడిసి దౌర్జన్యంగా ట్రాక్టర్ తో కూల్చివేసిందని, కుటుంబీకులపై దాడి చేసి పరుషపదజాలంతో దూషించి అవమానించారని సంచారజాతుల రాష్ట్ర అధ్యక్షులు తిప్పిరి శెట్టి శ్రీనివాస్, ఓడి కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శరత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ పట్టించుకోవడం లేదని, ఇకనైనా స్పందించి వీడీసీ నుంచి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ సోమవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ కులవృత్తి గాడుదులపై ఇసుక తరలిస్తామని, మొరం, మట్టి తరలిస్తూ ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలు, చెరువు కట్టల నిర్మాణంలో శ్రమజీవులుగా గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తామని తెలిపారు. ట్రాక్టర్, టిప్పర్లు రావడంతో వృత్తి పూర్తిగా అంతరించిపోవడంతో కూలి పని చేస్తూ జీవిస్తున్నట్టు తెలిపారు. బాధిత కుటుంబానికి ముగ్గురు కొడుకులలో ఒకరు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లగా ఇద్దరు గ్రామంలోనే పనిచేస్తూ గత 35 సంవత్సరాలుగా నల్లవెల్లి గ్రామంలో జీవిస్తున్నారని అన్నారు. 20 సంవత్సరాల క్రితమే నివాసం కోసం పట్టాభూమి కొనుక్కొని ఆ స్థాలంలో రేకుల షెడ్డు ఇల్లు నిర్మించుకున్నారు. అందులో చౌహాన్ లక్ష్మి, జగన్ కుటుంబ సభ్యులు జీవిస్తున్నారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా సాంబారి మురళి కుటుంబ సభ్యులు గ్రామ అభివృద్ధి కమిటీపై ఒత్తిడి తీసుకువచ్చి వారి స్థలాలకు రహదారి నిమిత్తం వారు నిర్మించుకున్న రేకుల షెడ్డును ట్రాక్టర్‌తో ఫిబ్రవరి 5న దౌర్జన్యంగా కూల్చివేశారని, ఆ సమయంలో ఇంట్లో సోనీ రెండు సంవత్సరాల బాలుడికి పాలు తాగిపిస్తున్న పట్టించుకోకుండా ఇంటిని కూల్చివేశారని అన్నారు. దాంతో బాలుడికి గొంతు భాగంలో రేకు తగిలి స్వల్ప గాయమై ప్రాణాపాయం తప్పిందని, ప్రశ్నించిన ఆ కుటుంబ సభ్యుల పై గొంతు నులిమి దాడి చేశారని, తోపులాటలో చౌహాన్ లక్ష్మి జాకెట్ చినిగిపోయి స్పృహ కోల్పోయి పడిపోయిందని, రేకుల షెడ్డుకు ఆనుకొని ఉన్న టేకు చెట్టును సైతం ట్రాక్టర్ తో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కులం లేని వాళ్ళు గాడుదులోల్లు చంపిన దిక్కులేని వాళ్ల అంటూ సాంబారి మురళి, సాంబారి విఠల్, వారి కుటుంబ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులైన పూదరి మనోహర్, తాళ్ల సాయిలు, అగ్గ జలంధర్, బండారి దామోదర్ తదితరులు పత్రికలో రాయలేని పరుషపదజాలంతో బూతులు తిడుతూ కుటుంబంపై అక్రమంగా దౌర్జన్యం చేశారని అన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని, చట్ట ప్రకారంగా వారిని కఠినంగా శిక్షించాలని ఆ గ్రామంలో ఆ కుటుంబానికి రక్షణ కల్పించి ప్రభుత్వం తరపున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమములో చౌహాన్ లక్ష్మి, జగన్ కుటుంబ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రాజు, సంచారజాతుల ఉపాధ్యక్షులు జాదవ్ నారాయణ, కార్యదర్శి లో సుధాకర్, సుధీర్, సాలుంకే లక్ష్మణ్, కామరెడ్డి జిల్లా నాయకులు జగన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో నిజాయితీగా విధులు నిర్వర్తించాలి

- వత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలి
- కొత్తగా వచ్చిన కానిస్టేబుల్‌కు రెండు రోజుల శిక్షణలో ఎస్పీ సింధుశర్మ




శిక్షణ ఇస్తున్న పోలీస్ అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

అంకిత భావంతో సేవలందిస్తూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులకు భరోసా ఇవ్వాలనీ ఎస్పీ సింధుశర్మ సూచించారు. పోలీసులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చెయ్యాలని, పోలీసు డ్యూటీలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించాలని వత్తిపరమైన జీవితంలో ఉన్న స్థాయికి ఎదగాలని, బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి భరోసా ఇచ్చేలా విధి నిర్వహణ ఉండాలని సూచించారు.

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో నూతనంగా వచ్చిన పోలీస్ సివిల్ కానిస్టేబుల్‌లకు జిల్లా పోలీస్ కార్యాలయంలో రెండు రోజులపాటు శిక్షణ అందించారు. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం ఏమిటంటే కొత్తగా వచ్చిన కానిస్టేబుల్‌లో పోలీస్ స్టేషన్లో విధులు ఎలా నిర్వర్తించాలి, ప్రజలతో ఎలా మెలగాలి, బందోబస్తు డ్యూటీ కి వెళ్ళినప్పుడు డ్యూటీ ఎలా చేయాలి, ట్రబుల్ మాంగర్లతోటి, ప్రజలతో ఏ విధంగా నడుచుకోవాలి అనే విషయాలపై సీనియర్ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బాన్సువాడ ఎల్లారెడ్డి డిఎస్పీలు, సిఐలు చంద్రశేఖర్, తిరుపతయ్య నరేష్, రామన్, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన కానిస్టేబుళ్లు

కాలం చెల్లిన మందులు తొలగించండి

- సిబ్బంది సమయ పాలన పాటించాలి
- డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ



నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాలం చెల్లిన మందులు ఉన్నట్లయితే వెంటనే తొలగించాలని డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ అన్నారు. ఆరోగ్య సిబ్బంది సమయ పాలన ఖచ్చితంగా పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఉదయం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణీ స్త్రీలకు చేస్తున్న రక్త పరీక్షల గురించి ల్యాబ్ టెక్నీషియన్ అనిత రాథోడ్‌ను వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఆస్పత్రి శుభ్రంగా ఉంచాలని అటెండర్‌ను ఆదేశించారు. ప్రతిరోజు రోగులకు ఇస్తున్న మందులు వివరాలను ఫార్మసిస్ట్ విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కాలం చెల్లిన మందులు ఉన్నట్లయితే తొలగించాలని, ఇన్ పేషెంట్ వార్డును పరిశీలించి ఒక గర్భిణీ స్త్రీని వివరాలు అడిగి ఐరన్ గ్లుకోస్, ఇంజక్షన్ ఇవ్వడాన్ని పరిశీలించారు. రోగులకు అన్ని రకాల మందులు అందజేయాలని వైద్యాధికారి డాక్టర్ సుశాంత్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు డాక్టర్ భువన, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని పడగల్ జీసస్ క్రైస్ట్ ప్రేయర్ ఏజీ చర్చ్" పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాస్టర్-నోవా- జాన్కంపేట్, ఉపాధ్యక్షులుగా పాస్టర్-రవిపాల్ -వేల్పూర్, కార్యదర్శిగా పాస్టర్-ఐసక్ అంక్సాపూర్, సహాయ కార్యదర్శిగా పాస్టర్-జి.లాజర్-కొత్తపల్లి-యన్, కోశాధికారిగా పాస్టర్ చిట్టి బాబు - అంక్సాపూర్, సలహాదారులుగా పాస్టర్-సీయోను కుమార్-పడగల్, పాస్టర్ ప్రేమ్ కుమార్-మోతె ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ మండల పాస్టర్లకు, క్రైస్తవులకు అందుబాటులో ఉండి సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి అన్ని విషయాల్లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

తడిపొడి చెత్త వేరుచేయాలి

- విద్యార్థులతో అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం పట్టణంలోని జడ్పిహెచ్.ఎస్ బాలుర పాఠశాలలో సోమవారం పిల్లలకు తడి పొడి, హానికర చెత్తల విభజన గురించి అలాగే ప్లాస్టిక్ తో కలిగే అనర్థాలను వివరించారు. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని సూచనలు ఇచ్చారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడంతోపాటు మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య, వార్డ్ ఆఫీసర్ అవినాష్, ఉపాధ్యాయులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెల్మల్ గ్రామ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

వెల్మల్ గ్రామంలో చాలా రోజుల నుండి వీధి కుక్కలు, కోతుల బెడద, గుంపులు గుంపుగా వీధిలో ప్రయాణిస్తూ చిన్న పిల్లలకు పెద్దలకు వీధి కుక్కలు, కోతుల భయం ఆందోళనలతో ప్రజలకు రోజురోజుకు ఇబ్బందికరంగా మారిందని ఎక్స్‌వార్డ్ మెంబర్ బోగా రాములు సోమవారం తెలిపారు. గ్రామంలో కూరగాయల మార్కెట్‌కోసం గ్రామ ప్రజలు స్థలం కేటాయించాలని గ్రామ పంచాయితీ సెక్రటరీ , వీడిసి సభ్యులకు వినతి పత్రం అందజేశారు.

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఢిల్లీలో ఎగిన కాషాయ జెండా గల్లీలో ఎగిరేవరకు ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా పని చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్ షాప్‌లో ముఖ్య అతిథిగా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచాయని అన్నారు. గత ప్రభుత్వం లక్ష ఉద్యోగాలు ఇస్తాం అంటే కాంగ్రెస్ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఒక్క నోటిఫికేషన్ కొత్తగా వేసిన దాఖలాలు లేవని తెలిపారు. గత ప్రభుత్వం 3 వేల నిరుద్యోగ భృతి అంటే కాంగ్రెస్ 4 వేలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశాయన్నారు, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లోని ఒక్క హామీ నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం అయిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పై ప్రశ్నిస్తే కాంగ్రెస్ కేసులు పెడుతుందని మండిపడ్డారు 317 జీవో, ప్రమోషన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేదన్నారు. ప్రశ్నించే గొంతుకలైన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డిని, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యను భారీ మెజారిటీతో గెలిపించె దిశగా కార్యకర్తలు పని చేయాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, ఇందూరు బిజెపి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ కొండా ఆశన్న, అసెంబ్లీ కో కన్వీనర్ నారాయణ యాదవ్, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఇమ్మడిగోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అంత్యక్రియలకు తనవంతు సహాయంగా 5000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని దర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇమ్మడి గోపి ముదిరాజ్ అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఇందల్ వాయి మండలంలోని గౌరారం గ్రామంలో ఒక నిరుపేద కుటుంబానికి చెందిన ముక్కెర గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి ముదిరాజ్, తాజా మాజీ సర్పంచ్ ఇమ్మడి లక్ష్మి భాదిత కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం 5000 రూపాయలను అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బొల్లారం చిన్న గంగారాం, తోగారి సాయిలు, పళ్ళికొండ నరేష్, కమ్మరి రాజు, పళ్ళికొండ చిన్న నర్సయ్య, ఒడిగే గంగరాజాం, తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి దేవతి శ్రీనివాస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి దేవతి శ్రీనివాస్, కరీంనగర్ ఎన్నికల అధికారి పమేలా సత్పతికి సోమవారం ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి దేవతి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ.. తాను ఈనెల 6న కరీంనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశానని, అందులో తన ఓటరు నమోదుకు సంబంధించిన కాపీ, సర్టిఫైడ్ కాపీ సమర్పించలేదని కరీంనగర్ ఎన్నికల అధికారి కార్యాలయం వారు, తనకు మెమో జారీ చేసిందన్నారు. ఎన్నికల అధికారులు అడిగిన వివరాలు అన్ని ఇవ్వాలని నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ అంకిత్‌ను కలిశానని, ఆ సందర్భంలో ఆయన తనను అవమానపరిచారని తెలిపారు. దీంతో తాను ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి కి ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. దళితుడినైన తనను అవమానపరిచే విధంగా వ్యవహరించిన అధికారిపై చర్య తీసుకోవాలని కోరారు.

టూరిజం హబ్‌గా డిచ్‌పల్లి రామాలయం

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి



స్వామివారి విగ్రహాలను తీసుకువస్తున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



రామాలయ పరిసరాలను పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని టూరిజం హబ్‌గా మార్చుతామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి చెప్పారు. ఖిల్లా డిచ్‌పల్లిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సీతారామ చంద్రస్వామి కల్యాణోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ రమేష్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్ రెడ్డి, ఇతర నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్‌లోని డిచ్ పల్లి రామాలయం, అనంత పద్మనాభస్వామి దేవాలయం, రామడుగు ప్రాజెక్టులను టూరిజం కేంద్రాలుగా మార్చి పర్యాటకులు భారీ సంఖ్యలో వచ్చేవిధంగా చూస్తానన్నారు. ఆలయం పక్కన గల చెరువులు, ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు విషయమై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాన్నారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ పూరాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఇందులో భాగంగా రానున్న రోజుల్లో రామాలయం అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచంద్ నాయక్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆలయ కమిటి చైర్మన్ శాంతయ్య, నాయకులు అమృతపూర్ గంగాధర్, సుదర్శన్, మహేందర్ రెడ్డి, వాసు, దాసు, లచ్చమోల్ల దత్తాద్రి, గ్రామాభివృద్ధి కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.

ఎమ్మెల్యేకు వినతి..

డిచ్‌పల్లి రామాలయంను అభివృద్ధి చేయడానికిగాను నిధులు మంజూరు చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ రమేష్ రెడ్డికి ఆలయ కమిటి చైర్మన్ శాంతయ్య, గ్రామాభివృద్ధి కమిటి ప్రతినిధి సుదర్శన్, ప్రతినిధులు వినతి పత్రాన్ని అందించారు.

త్రిపుర పీస్‌ఫుల్ స్టేట్

- త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డి



గవర్నర్‌ను సన్మానించిన జిజి ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

త్రిపుర పీస్ ఫుల్ స్టేట్ అని.. రిచ్ స్టేట్.. అన్ని రకాలుగా మంచి ప్రాంతమని గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్‌కు వచ్చిన ఆయన పట్టణంలో బిజెపి సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి స్వగృహంలో మాట్లాడుతూ.. టూరిజం స్పాట్ త్రిపురలో శక్తిపీఠం త్రిపుర సుందరి అమ్మవారు ఉన్నారని అన్నారు. త్రిపురను సందర్శించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవనాథ సిద్దేశ్వరుని దర్శించుకున్న త్రిపుర గవర్నర్

పట్టణంలోని శ్రీ నవనాథ సిద్దేశ్వరుని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశం టెంపుల్ టూరిజంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభాను ఆకర్షించే దేశమని ఆయన మీడియాతో అన్నారు. టెంపుల్ టూరిజాన్ని ఇంకా డెవలప్మెంట్ చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

త్రిపుర రాష్ట్ర గవర్నర్‌కు సన్మానం

త్రిపుర రాష్ట్ర గవర్నర్ శ్రీ. ఇంద్రసెన్ రెడ్డి నీ పట్టణంలోని జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి ఆధ్వర్యంలో క్షత్రియ పట్కరి సంస్కృతికి చెందిన తలకు టోపీ, శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించి ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమంలో రోటరీ ఆదర్శ మాజీ అధ్యక్షులు డిజె దయానంద్, అల్లపూర్ రాజేశ్వర్, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు నారాయణ్ వర్మ, డీజే కాశినాథ్, డీజే సునీల్, దుర్గాప్రసాద్, బొచ్కర్ వేను తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు ఆహ్వానం

కంఠేశ్వర్ : ఆర్మూర్ వచ్చిన త్రిపుర గవర్నర్ ఇంద్రసే నారెడ్డిని నిజామాబాద్ ఇందూరు తిరుమల ఆలయ ధర్మ కర్త నరసింహారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. మంగళవారం ఆలయంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

కృతజ్ఞతాభావం విజయానికి మూల స్తంభం

- ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్



నవతెలంగాణ-ఆర్మూర్

కృతజ్ఞతా భావం విజయానికి మూల స్తంభం అని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ అన్నారు. పట్టణంలోని గాంధీ నగర్‌లోగల ఆక్సర్డ్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కృతజ్ఞతా భావం విజయానికి మూల స్తంభం అని, విద్యార్థులు కని పెంచిన తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సర్వదా కృతజ్ఞులుగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మనం అన్నింటిపట్ల కృతజ్ఞత భావంతో ఉన్నప్పుడే మన లక్ష్యాలు నెరవేరడానికి విశ్వమంతా సహకరిస్తుందని ఆయన అన్నారు. పాఠశాల పాలనాధికారి పద్మ మాట్లాడుతూ.. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని ప్రతి రోజు జ్ఞాపకం చేసుకోవాలని అన్నారు. ఎంచుకున్న లక్ష్యం సాధ్యమవుతుందని దృఢంగా నమ్మాలని అప్పుడే అది నెరవేరుతుందని ఆమె అన్నారు. మీ నమ్మకమే మీ లక్ష సాధనకు మొదటి మెట్టు అవుతుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులు పాఠశాలలో చదివిన సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో అనుచితంగా ప్రవర్తించిన ఘటనలు స్టేజ్ పైన తమ ఉపన్యాసాలలో అందరితో పంచుకొని బాగోద్వేగానికి లోనయ్యారు. పదవ తరగతి విద్యార్థులు 9వ తరగతి విద్యార్థులకు సమయాన్ని వృథా చేసుకోకుండా మొదటినుండే సద్వినియోగం చేసుకొని సత్ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించినందుకు పదవ తరగతి విద్యార్థులు 9వ తరగతి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు మున్ముందు మంచి స్థాయికి ఎదగాలి

- ఎఫ్‌పిఎస్‌టి సెక్రెటరీ పసుపుల రఘునాథ్



విద్యార్థులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు భౌతిక రసాయన శాస్త్రంలో ముందు ముందు మంచి స్థాయికి ఎదగాలని ఎఫ్‌పిఎస్‌టి సెక్రెటరీ పసుపుల రఘునాథ్ అన్నారు. జిల్లాస్థాయి భౌతిక రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్ సోమవారం జిల్లాలోని మాణిక్ భవన్ పాఠశాలలలో నిర్వహించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లాలోని వివిధ మండలాల మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పసుపుల రఘునాథ్ ముఖ్య అతిథి డిఈఓ అశోక్ , గౌరవ అతిథులుగా డీఎస్ఓ గంగా కిషన్, ఎఫ్‌పిఎస్‌టి కోశాధికారి శ్రీనివాస్ గౌడ్, సలహాదారుడు పోచన్న గంగాధర్ రాజా అనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎఫ్‌పిఎస్‌టి సెక్రెటరీ మాట్లాడుతూ.. భౌతిక రసాయన శాస్త్రంలో 10 సంవత్సరాల నుండి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు భౌతిక రసాయన శాస్త్రం పట్ల శ్రద్ధ వహించి మున్ముందు మంచి స్థాయికి ఎదగాలని కోరారు. సభ్యులను అభినందించారు. జిల్లాలో గల 33 మండలాల విద్యార్థులు పాల్గొనగా వారిలో రాష్ట్రస్థాయికి ముగ్గురు విద్యార్థులు ఎంపిక అయ్యారు. వారిలో పి.హర్షిత-జెడ్‌పిహెచ్ఎస్ మెండోరా మొదటి స్థానం, ద్వితీయ స్థానంలో పి.ఆశని- జడ్‌పిహెచ్ఎస్ మెండోరా, గతస్వార్-జెడ్పిహెచ్ఎస్ ఆర్మూరు విద్యార్థులు గెలుపొందారు. విద్యార్థులందరికీ మెమెంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోగస్ సర్వేతో పోయింది కాంగ్రెస్ పరువే

- కేసీఆర్ హయాంలోనే బీసీలకు స్వర్ణయుగం
- బీఆర్ఎస్ శ్రేణులు బీసీల పోరులో కదం తొక్కాలి
- కులగణన రీసర్వే జరిగే వరకు పోరు ఆగదు
- మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీల నెత్తిపై కాంగ్రెస్ కత్తి వేలాడుతోందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారిని నిలువునా ముంచిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. కులగణన పేరుతో ఇటీవల నిర్వహించిన బోగస్ సర్వేతో పోయింది కాంగ్రెస్ పరువేనని ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఏరు దాటిన తరువాత తెప్ప తగలబెట్టడం కాంగ్రెస్ నైజమని, బడుగులను ఏమార్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు వారి గొంతు కోసిందని ఆయన మండిపడ్డారు.' కాంగ్రెస్ నిర్వహించిన కులగణన సర్వే బోగస్ అని, రీసర్వే చేస్తేనే బీసీల జనాభా ఎంత అన్న విషయంలో ఖచ్చితమైన గణాంకాలు వెలుగు చూస్తాయని తెలిపారు. బీసీల ఓట్ల కోసం వారిని ఏమార్చేందుకు పచ్చి అబద్దాలతో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెన్నుపోటు పొడిచిందని, బీసీల జనాభాను ఐదున్నర శాతం తక్కువగా చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవంపైనే దెబ్బ కొట్టిందని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల హామీని రేవంత్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, కాంగ్రెస్ డ్రామాలో భాగంగా జరిగిన కులగణన చిత్తుకాగితం విలువ కూడా చేయదని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రేషన్ కార్డుల మంజూరు, ఇండ్ల కేటాయింపుల్లో, ఆరు గ్యారంటీల వర్తింపులో తమ వాటా తగ్గుతుందనే భయం ఎంబీసీలు, బీసీ ప్రజల్లో నెలకొందని, బీసీ డిక్లరేషన్ పేరుతో కామారెడ్డి సభలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని, బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ పెడతామని, బీసీ సబ్ ప్లాన్ తీసుకొస్తామని కాంగ్రెస్ నమ్మబలికిందని పేర్కొన్నారు.

ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, ప్రొక్యుర్మెంట్లలో 42శాతం బీసీలకే ఇస్తామని కాంగ్రెస్ ఆశజూపింది. కానీ 15 నెలలు గడిచినా బీసీ డిక్లరేషన్ అమలు కోసం ప్రభుత్వం నయాపైసా కేటాయించలేదని,

కొత్తగా బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో కార్పొరేషన్ 50 కోట్ల బడ్జెట్ ఇస్తామని ఇచ్చిన హామీలకు అతీగతీ లేదని తెలిపారు. బీసీల జనాభాను ఐదున్నర శాతం తగ్గించి దాదాపు 22 లక్షల మందిని లేనట్టుగా చిత్రీకరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుర్నీతిని బీసీ సోదరులు ఎండగట్టాలని పేర్కొనానరు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అశాస్త్రీయ కులగణన అసంబద్ధమని నిరసన గళమెత్తాలని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చీటింగ్ చేసిన చోట నుంచే సర్కారుపై ఫైటింగ్ మొదలు కావాలని, కామారెడ్డిలో కొడితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోమాలోకి పోవాలని తెలిపారు. బీసీల దెబ్బకు కాంగ్రెస్ ఏసీ కోటలు కూలాలని, కేసీఆర్ హయాంలోనే బీసీలకు స్వర్ణయుగం. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో బీసీలకు ఆయన అత్యంత ప్రాధాన్యతనిచ్చారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు బీసీల పోరులో కదం తొక్కాలని, బీసీలకు జరిగిన ద్రోహంపై ప్రజల్లో చర్చ జరగాలని ఆయన కోరారు.కులగణన రీసర్వే జరిగే వరకు, బీసీలకు న్యాయమైన వాటా దక్కేంత వరకు పోరు ఆగదని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఉపాధ్యాయునికి సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

కళా రంగంలో గత ఎన్నో ఏళ్లుగా సేవలు చేసి ఎందరో విద్యార్థులను కళాకారులుగా తీర్చిదిద్దిన నాగరాజుకు గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా మండలంలోని కోమన్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా త్రపధానోపాధ్యాయురాలు కవిత మాట్లాడుతూ నాగరాజు విద్యార్థులకు అభినయం ద్వారా నృత్యం ద్వారా పాఠాలు బోధిస్తూ తేలికగా అర్థమయ్యేలా చెప్పడంలో దిట్ట అని కొనియాడారు. తక్కువ సమయంలోనే విద్యార్థులను చక్కటి కళాకారులుగా తీర్చిదిద్దిన ఘనత నాగరాజుదని ఈ సందర్భంగా అభినందించారు. తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయు డికి గౌరవ డాక్టరేట్ రావడం గర్వకారణంగా ఉందని జిల్లా పిఆర్టియు క్రమశిక్షణ సంఘం చైర్మన్, రూరల్ అధ్యక్షులు ఇట్టం గోపాల్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వినోద్, జే .వినోద్, భగవంత్ రావు, లక్ష్మీబాయి విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాలు తనిఖీ



ప్రయోగ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇంటర్ విద్యాధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో రెండవ స్పెల్ ప్రయోగ పరీక్షలు జరుగుతున్న పరీక్ష కేంద్రాలను సోమవారం జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తనిఖీ చేశారు. సోమవారం ప్రయోగ పరీక్షలు జరుగుతున్న ఇందల్వాయి మోడల్ జూనియర్ కళాశాల, వెక్టార్ జూనియర్ కళాశాల, ఎస్సార్ జూనియర్ కళాశాల, ధర్మారంలోని సాంఘిక సంక్షేమ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలలను ఇంటర్ విద్య అధికారి తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య రజియుద్దీన్ అస్లామ్, కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలో మరో 10 కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని స్వయంగా ఇంటర్ విద్య అధికారి పరిశీలించి సమీక్షించారు. ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతి పరీక్షా కేంద్రంలో కెమెరాలకు జియో ట్యాగింగ్ పరిశీలించారు. కెమరాలు ఆగిపోకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌లను ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. లైవ్ కెమెరాల ద్వారా హైదరాబాద్ లో కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కమిషనర్ పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు.

ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని తోపు గుట్టపై గల భక్త మార్కండే ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు పారిపల్లి సంతోష్ తెలిపారు. మండల కేంద్రంలోని శిస్తే లింగేశ్వర మందిరం పక్కన ఏర్పాటు చేసిన భక్త మార్కండేయ దేవాలయంలో తిదిరి, జక్కని పండి వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా పోచారం జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో మాజీ మంత్రి, మాజీ స్పీకర్, ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు పుప్పాల శంకర్, ఏఎంసి చైర్మన్ గైక్వాడ్ హన్మంతు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు, అన్ని గ్రామాల, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణా తరగతుల్లో కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ బోధన్

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో, బోధన్ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో బోధన్ డివిజన్ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుంచే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నోటిఫికేషన్‌లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియా రం అందుబా టులో ఉండేలా చూసుకో వాలన్నా రు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో పాటు వారి ప్రతిపాదకులు స్థానికులేనా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకో వాలని అన్నా రు. అదేవిధ ంగా నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని, ఓటరు జాబితాలోని పేరును అక్షర క్రమం కోసం పరిగణలోకి తీసుకుంటే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని తెలిపారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి ప్రతి రోజు త్వరితగతిన డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్‌సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్‌చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో, విత్ డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయిస్తే, తగిన ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్ఓలు, సహాయ ఆర్.ఓలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, డీ.ఎల్.పీ.ఓలు, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

బంజారా యూత్ అధ్యక్షుడిగా గణేష్ నాయక్



యూత్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న బంజారా సంఘ సభ్యులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

మండలంలోని బంజారా సంఘం యూత్ అధ్యక్షులుగా గణేష్ నాయక్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎల్లారెడ్డి బంజారా యూత్ అధ్యక్షునిగా ఎన్నికైన గణేష్ నాయక్‌కు ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శాలువా కప్పి సన్మానించారు. మండలంలోని 18 తండాలు కలిసి బంజారా సంఘం యూత్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూత్ మండలాధ్యక్షులు సంతోష్ నాయక్, ఉపాధ్యక్షులు కిరణ్ తేజ, పెద్ద రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు యాసిన్, వెల్లుట్ల సంతోష్, మాజీ సర్పంచ్ బాలయ్య, దత్తు, వెంకట్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆచూకీ లభ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఆదివారం గల్లంతైన వ్యక్తి మృతదేహన్ని సోమవారం లభ్యమైనట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం అన్నసాగర్ గ్రామానికి చెందిన కర్రే విట్టల్ (40) ఆదివారం మధ్యాహ్నం మహమ్మద్‌నగర్ నుంచి గున్కులు వెళ్లేదారిలో గల నిజాంసాగర్ ప్రధాన కాలువలో చేపలు కనబడడంతో పట్టుకోవడానికి కాల్వలో దిగి ప్రమాదవశాత్తు అందులోనే పడి గల్లంతయ్యాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో నీటి విడుదలను నిలిపివేసి ప్రధాన కాలువలో వెతకగా బురుగుల్ శివారులో మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై తెలిపారు. విట్టల్ మిషన్ భగీరథలో హెల్పర్‌గా పనిచేసేవాడని భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బాల్య వివాహాలు నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎంఈఓ మంజూష

నవతెలంగాణ-బోధన్

బాల్య వివాహాలు జరగకుండా నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సాలూర మండల ఎంఈఓ రాజి మంజూష అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన భేటి పడావో, భేటి బచావో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిశు, భ్రూణ హత్యలు జరగకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. అలాగే బాలికలపై జరిగే అఘాయిత్యాలు జరగకుండా వాటిని నిరోధించడం అందరి బాధ్యత అని సూచించారు. ఆడపిల్లలను 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ బోధన్ సిడిపిఓ జానకి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, పాఠశాల టీచర్స్ ఐసిపిఎస్ సోషల్ వర్కర్ సాయిలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ మంజూష

సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఆదేశానుసారం ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ తండాను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ.. తండాలో ప్రధాన సమస్య అయిన సిసి రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు అవసరమున్నాయని నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద లైట్స్ కావాలని చెప్పడంతో మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తన సొంత డబ్బులతో ఆలయం వద్ద విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించారు. త్వరలో హైమాస్ లైట్స్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తండావాసులు మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. వీరితో పాటు మాజీ జడ్పీటీసీ సామేల్, భిక్కనూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సంజీవరెడ్డి, సొసైటీ డైరెక్టర్ చెన్నంగారి సుఖేందర్‌రెడ్డి, తిమ్మాపూర్ గ్రామ అధ్యక్షుల నర్సింలు, గంగారం, సాయిబాబు, మాజీ సర్పంచ్ రవీందర్, రాక్రే నాయక్, ఉపసర్పంచ్ గోపాల్, నర్సింలు తిమ్మాపూర్ తండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రకాష్, మాజీ డి.ఎస్.పి తవారియా, లక్ష్మణ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ సందర్శనలో నాయకులు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-కామారెడ్డి(బీబీపేట్)

బిబిపేట్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సుతారి రమేష్ ఆధ్వర్యంలో దాదాపు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్టు సుతారి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు వివరించారు. ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షించిన అనంతరం ఉచితంగా మందులు అందజేసినట్టు పేర్కొన్నారు. బీపీ, షుగర్‌తో పాటు దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, బలానికి, అల్సర్‌గ్యాస్ తదితర ఇబ్బందులు ఉన్నవారిని గుర్తించి ఉచితంగా మందులను అందజేశారు. ఎంపిక చేయబడిన పేషెంట్ల కోసం బుధవారం బస్సు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్ వెళ్లి వైద్యం చేయించుకునేవారు, ఆపరేషన్ ఉన్న వాళ్ల ఆపరేషన్లు అన్ని ఉచితంగా కల్పించనున్నట్టు తెలిపారు. హాస్పిటల్‌లో ఇప్పటివరకు 40 మంది పేర్లు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ తన్మై, గైనకాలజిస్ట్ సుశ్విత, న్యూరో స్పెషలిస్ట్ శాశ్విత, న్యూరో డాక్టరు స్నేహిత, రేవతి, ఫార్మాసిస్ట్ భరత్‌రెడ్డి, క్యాంప్ నిర్వాహకులు ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్‌కు టిజిఎల్ఏ 475 సంఘం పూర్తి మద్దతు

- కామారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 27న జరిగే ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న టిపిటిఎఫ్, యూటీఎఫ్, అదేవిధంగా ఉపాధ్యాయ అధ్యాపక వివిధ సంఘాలు బలపరుస్తున్న వై.అశోక్ కుమార్‌కు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 సంఘం పూర్తిగా సంపూర్ణ మద్దతు ఇస్తూ ఆయన గెలుపునకు సంఘం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కామారెడ్డి జిల్లా అధ్యక్షులు జే గంగాధర్, కార్యదర్శి జె.విజయ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

కూనిపూర్‌లో శివుని విగ్రహం ప్రతిష్టాపన

- హాజరైన బాన్సువాడ ఎమ్మెల్యే



విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-వర్ని

మండలంలోని కూనిపూర్ గ్రామంలో శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శ్రీశ్రీశ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి మహాస్వామి, మల్లారం పిట్ల కృష్ణ మహారాజ్ స్వామి, ప్రతిష్టాపన చేశారు. సోమవారం ఉదయం యజ్ఞం చేశారు. హంపీ పీఠాధిపతి స్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు, పెద్దలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగదాంబమాత, సంత్ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సదాశివనగర్

జగదాంబ మాత, సంత్ సేవాలాల్ మహారాజ్ అని ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సురేందర్ గిరిజన నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని యాచారం తండాలో వెలిసిన జగదంబమాత సేవాలాల్ ఆలయ 36వ వార్షికోత్సవ ఉత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని యాచారం తండాలో చారిత్రాత్మక ఆలయ ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంగ్యానాయక్, వైస్ చైర్మన్, మాజీ క్యాషియర్ పీర్ సింగ్, సదాశివనగర్ ఏఎంసి చైర్మెన్ సంగ్యానాయక్, సదర్ నాయక్, సంతోష్ నాయక్, సురేందర్ రాథోడ్, బలిరామ్ నాయక్, లాల్ సింగ్, శంకర్ నాయక్, లచ్చిరాం నాయక్, భాబ్యానాయక్, రమేష్ నాయక్, సవాయిరాం, శ్రీనివాస్, మోహన్ సింగ్, గణేష్ నాయక్, జైత్రం, శివరాంనాయక్, అమర్‌సింగ్, యాచారం తండా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పెద్ద పోచమ్మ, చిన్న పోచమ్మ, నవగ్రహాల ప్రతిష్టాపన



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో పోచమ్మ విగ్రహాల పున ప్రతిష్టాపన అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలో పలు జంటలు యజ్ఞంలో కూర్చొని వేదమంత్రాలతో విగ్రహ ప్రతిష్టాపన చేశారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ మందిరంలో నూతనంగా నవగ్రహాల ప్రతిష్టాపన జరిపారు. గ్రామ పొలిమేర నుంచి శోభాయాత్రగా విగ్రహాలను ఊరేగించి వేదమంత్రాలతో వాటిని పున: ప్రతిష్టాపన చేసినట్టు గ్రామ కమిటీ అధ్యక్షులు కంఠం గంగారం పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నందకుమార్, అబ్బగోని గంగాధర్ గౌడ్, వచ్చేవార్ నితీన్, కురుమ సాయిలు, గోపికృష్ణ, డైరెక్టర్ సాయిలు, ప్రేమ్‌కుమార్, జి.గంగారాం, బాలకృష్ణ (కిట్టు), సంతోష్, అనిల్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పే చర్చ కాన్ఫరెన్స్‌లో రాంపూర్ విద్యార్థులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడనాడి.. చదువులో ముందుకు సాగాలని వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించారు. సోమవారం మండలంలోని రాంపూర్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష పే చర్చ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానమంత్రి సూచనలు, సలహాలను విద్యార్థులు జాగ్రత్తగా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. మార్కులు తక్కువ వచ్చాయని, ఫెయిల్ అయ్యానని నిరుత్సాహ పడవద్దని మళ్లీ ప్రయత్నం చేసి విజయతీరాలవైపు తమ గమ్యస్థానాన్ని ముందుకు సాగించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, సిబ్బంది విట్టల్, బుజ్జయ్య, సాయిబాబా, పోతన, నాగేశ్వరరావు, రాజు, నీలిమా, పుష్పలత, స్వరూప, రాజు, నబి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గౌరారం గ్రామంలో శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయం 6వ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మాజీ శాసన సభ్యులు జాజాల సురేందర్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముద్దేలి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు సజనపల్లి సాయిరాం, మండల మాజీ కోఆప్షన్‌మెంబర్ సయ్యద్ ముస్తఫా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్ విధానంపై యుద్ధభేరి



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న టీఎస్ సీపీఎస్ఈయు సభ్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

యుపిఎస్ విధానంపై టీఎస్ సీపీఎస్ఈయు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి యుద్ధభేరి మోగించినట్లు తెలిపారు. సోమవారం భిక్కనూరు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం యుపిఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఓపిఎస్ వచ్చేవరకు ఉద్యమాలు ఆగబోవని అన్నారు. మార్చి 2న పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మోహన్, సునీల్, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-వర్ని

ఉమ్మడి మండలాల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చందూర్ మండలంలో బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. వర్ని మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోస్రా మండల నాయకులు కేక్ కట్ చేసి, అనంతరం ఉమ్మడి మండల నాయకులు పోచారం నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

100 శాతం ఇంటి పన్ను వసూలు చేయడమే లక్ష్యం

- ఆ దిశగా పనిచేస్తున్న బిల్ కలెక్టర్లు



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు వార్డు అధికారులు అగ్గు నర్సయ్య, హేమంత్‌రెడ్డి, విజయ్, సాయిచరణ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పలు వార్డులలో 100శాతం ఇంటి టాక్స్ వసూలు చేయడమే లక్ష్యంగా అందరు కలిసి బిల్లు కలెక్టర్లు బందంగా ఏర్పడి ఇంటి పన్నులు వసూలు చేయడం జరిగిందని బిల్ కలెక్టర్ గంగా మోహన్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధికారులు అగ్గు నర్సయ్య, హేమంత్ రెడ్డి, విజయ్, సాయిచరణ్, బిల్ కలెక్టర్‌లు చెన్న గంగామోహన్, రాజశేఖర్, సువర్ణ ఒక్క బందంగా వాసులు చేశారు. కార్యక్రమంలో స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-భీంగల్ రూరల్

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మండలంలోని జాగీర్యాల్, దేవన్‌పల్లి, లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయించిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లబ్ధిదారులు కతజ్ఞతలు తెలిపారు.

ముందే ముదిరిన ఎండలు

- తగ్గిన చలి తీవ్రత
- 35, 36 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- వేసవిలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం



నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం శివరాత్రితో చలి శివ శివా అంటూ వెళ్ళిపోతుందనేది చిన్నప్పుడు పెద్దలు చెప్పిన సూక్తి. శివరాత్రికి 20 రోజులపైనే సమయం ఉన్నప్పటికి చలి జాడ లేకుండా పోయింది. నిజామాబాద్ జిల్లాలో చలి తగ్గి ఎండ కొడుతుంది. గత పది రోజులుగా చలి తీవ్రత తగ్గి వేడి తీవ్రత పెరిగిపోయింది. దీనివల్ల ఎక్కడ కూర్చున్న ఎక్కడ పనిలో ఉన్న వేడితో ఇబ్బందికరంగా మారిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో కూడా అదే తంతుగా మారింది. రాత్రి వేళల్లో చలి ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. ఈ సారి చలికాలం సీజన్ ఏ మాత్రం జనాన్ని వణికించలేకపోయింది. ఉదయం 10 దాటితే ఎండలు ముదురుతున్నాయి. మధ్యాహ్నం పూట రోడ్లమీద నిలువ లేని పరిస్థితి. అప్పుడే ఎండలు ముదురుతుండడంతో రాబోయే వేసవి సీజన్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ వేడి రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో జనాలు అనారోగ్యం పాలవుతున్నారు.

గత వారం రోజులుగా గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు

34.5/19.4, 36.0/18.9, 35.5/20.4, 34.1/20.1, 35.2/20.7, 35.1/20.3, 34.9/20.4 ఉష్ణోగ్రతలు నమోదు కాగా, గడిచిన నాలుగైదు రోజులుగా 34 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే రాబోయే రోజుల్లో ఏంటి అనే ఆందోళన నెలకొంది. గతంతో పోలిస్తే ఈ సంవత్సర 2025లో ఎండలు తీవ్రంగా కొట్టే అవకాశం ఉంది. అందుకని గుణంగా జాగ్రత్తలు తీసుకొని ప్రజలు మెదులుకోవాలి.

రాష్ట్ర స్థాయికి బి టాపర్ విద్యార్థి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగినటువంటి రాష్ట్రస్థాయి అండర్ -16 అథ్లెటిక్స్ లోని 400 మీటర్ల పరుగు పందెం లో మొదటి స్థాయిలో నిలిచి బంగారు పతకం సాధించిన కామారెడ్డి జిల్లా వివేకానంద బి టాపర్ పాఠశాల విద్యార్థి బూర్ల సంజు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైయ్యారు. అఖిల్, అరుణ్, విధ్వంత్ గౌడ్ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయిలో రాణించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గురువేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతివిద్యార్థికి విద్య తో పాటు క్రీడలు కూడా ముఖ్యమని తెలిపారు. ప్రిన్సిపాల్ వీరభద్రప్ప, మేనేజింగ్ డైరెక్టర్ ఏనుగు రవిరెడ్డి, చందుపట్ల శ్రీకాంత్, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముదాం శ్రీధర్, శశిప్రీతం, వ్యాయామ ఉపాధ్యాయులు బీబీపేట దిలీప్ కుమార్, హరిలాల్ పాల్గొన్నారు.

అపురూప వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న త్రిపుర గవర్నర్



పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పండితులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామిని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసెన రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న తరువాత పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పండితులు పూర్ణ కుంభతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డ్ చైర్మన్ పల్లె గంగా రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షులు దినేష్ కులచారి, ఆలయ చైర్మన్ అమృత లత రెడ్డి, నరేందర్ రెడ్డి, లోక భూపతి రెడ్డి, ఆలూరు భారతి, బీజేపీ మండల అధ్యక్షులు మదారి మమత రాజేశ్వర్, సంతోష్, గంగారెడ్డి, శ్రీకాంత్, రాజేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఇందూరు తిరుమల క్షేత్రానికి రానున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సంపల్లిలోగల ఇందూరు తిరుమలలో మాఘ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే "ఉత్సవంలో పాల్గొనడానికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మంగళవారం వస్తున్నారని ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి సోమవారం తెలిపారు. ప్రతి సంవత్సరం మాఘమాసంలో వచ్చే పౌర్ణమి సందర్భంగా సంతానం లేని వారికి దివ్య ప్రసాదాన్ని ఇస్తామని తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో త్రిపుర గవర్నర్‌తో పాటు ప్రముఖ నిర్మాత దిల్ రాజు పాల్గొంటారని తెలిపారు. త్రిపుర గవర్నర్ ఆలయానికి సాయంత్రం 4.గంటలకు చేరుకుంటారని తెలిపారు.

ఆరోగ్య విద్యను ప్రోత్సహించాలి

- వైస్ ఛాన్సలర్ టి యాదగిరిరావు



వీసికి ఎంఓయు పత్రాలు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ, సూర్య ఆరోగ్య సంస్థ మధ్య సోమవారం (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) అవగాహన ఒప్పంద పత్రాలపై తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి, సూర్యాస్ హెల్త్ ఆర్గనైజేషన్ చైర్ పర్సన్ చేకూరి ఉదయ సూర్యభగవాన్, కేదం రాజేంద్ర కుమార్, విక్రమ్ సంతకం చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ చేకూరి ఉదయ సూర్య భగవాన్ మాట్లాడుతూ.. సూర్యాస్ హెల్త్ ఆర్గనైజేషన్ అనేది లాభాపేక్షలేని ఛారిటబుల్ ట్రస్ట్ (ఇండియా ట్రస్ట్ యాక్ట్), 1982 కింద రిజిస్టర్ చేయబడిన స్వచ్ఛంద సంస్థ, సమగ్రమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా ప్రజారోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచడానికి కట్టుబడి ఉందన్నారు. మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, సాధారణ వైద్యం, విద్య తెలంగాణ యూనివర్సిటీ లో స్టూడెంట్ సపోర్ట్ సెంటర్ (ఎస్ఎస్‌సి) ఏర్పాటు చేసి సమగ్ర విద్యార్థి ఆరోగ్య అభివృద్ధికి ఈ సంస్థ మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాలకు కట్టుబడి ఆరోగ్య విద్య కౌన్సెలింగ్ సేవలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలు, నిర్మాణాత్మక సంస్కరణ కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో మానసిక, భావోద్వేగ, శారీరక శ్రేయస్సును పెంపొందించడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం కావాలన్నారు. కార్యక్రమంలోడీన్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ గంటా చంద్ర శేఖర్, ప్రొఫెసర్ ఆంజనేయులు, సూర్యస్ హెల్త్ ఆర్గనైజేషన్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యులు డాక్టర్ రవితేజ ఇన్నమూరి, న్యూరో సైకియాట్రిస్ట్, ఆనంద్ మైండ్ కేర్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ అంజయ్య పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



వీర్‌సింగ్ (ఫైల్)

నవతెలంగాణ-బాల్కొండ

ఇందిరమ్మ వరద కాలువలో ఆదివారం ప్రమాదవశాత్తు పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైందని హెడ్ కానిస్టేబుల్ ఠాకూర్ సింగ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వీర్ సింగ్ (36) మండల పరిధిలోని బస్సాపూర్ గ్రామంలో మేస్త్రి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం వీర్ సింగ్ షాట్‌కట్‌లో బస్సాపూర్‌కి వెళ్దామని లక్ష్మీ కాల్వ సైడ్ గ్రిల్ వాల్ నుండి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి ఎస్సారెస్పీ వరద కాలువలో పడిపోయాడు. ఆయన కోసం కాలువలో వెతుకగా ఆచూకీ లభ్యం కాలేదు. మరుసటి రోజు సోమవారం వీర్ సింగ్ మృతదేహం నీటిలో తేలియాడింది. వీర్ సింగ్ తమ్ముడు బిద్ మాన్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఠాకూర్ సింగ్ తెలిపారు.

12వ వార్షికోత్సవ సభను జయప్రదం చేయండి

- సాహిత్య సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంకణాల రాజేశ్వర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ సాంస్కృతిక సంస్థ 12వ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సాహిత్య సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంకణాల రాజేశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో నేడు నిర్వహించనున్నట్లు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కళలు, కళాకారుల ఆట, పాట, మాట, కవి సమ్మేళనం ఉంటుందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఆసక్తి గల కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. కవులకు, కళాకారులకు, కళా ఉత్సవం అవార్డు ప్రధానం చేయనున్నారని వివరించారు.

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



నవతెలంగాణ-మోపాల్

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిషరీస్ అధ్యక్షుడు పసుల శ్రీనివాస్ సోమవారం సన్మానించారు.

కులగణనపై ప్రతిపక్షాల రాద్ధాంతం

- రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్



మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కులగణన శాస్త్రీయంగా జరిగినా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాహుల్ గాంధీ సూచనల మేరకు బీసీలకు న్యాయం కోసం రేవంత్ సర్కార్ రాష్ట్రంలో కులగణన చేసిందని ఆయన గుర్తు చేశారు. కులగణన చేయని బీజేపీ ఈ రోజు కాంగ్రెస్ సర్కార్ ను విమర్శించడం శోచనీయమని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేయలేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ చేనేత ఐక్య వేదిక నిజామాబాద్ జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం నిజామాబాద్ నగరంలోని పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తన్నీర్ శ్రీనివాస్,మెరుగు శ్రీనివాస్, కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ.. చేనేత రంగానికి కాంగ్రెస్ సర్కార్ చేయూత నిస్తుందన్నారు. త్వరలోనే చేనేత తదితర సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మాటలు తప్ప గత ప్రభుత్వాలు పద్మశాలీలకు ఏమీ చేయలేదని, ఎంపీగా అర్వింద్‌ను గెలిపించినా ఆయన పద్మశాలీలకు చేసింది ఏమీ లేదని దుయ్యబట్టారు. మాజీ ఎంపి రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక పద్మశాలి సమాజం అని అన్నారు. నిరంతరం చైతన్య వంతంగా ఉండి చేనేత రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పద్మశాలీలందరిపై ఉందన్నారు. పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు దీకొండ యాదగిరి, జిల్లా అధ్యక్షులు బిజ్జు దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, పద్మశాలి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, నగర పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జేటి వెంకటనర్సయ్య, జిల్లా పద్మశాలి సంఘం సలహాదారులు రాపెల్లి గురుచరణం, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గుడ్ల చంద్రభాగ, నగర అధ్యక్షురాలు బల్ల లక్ష్మీభాయి, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ భాధితుడిని స్వగ్రామం రప్పించేందుకు చర్యలు

- టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా హామీ
- స్వదేశం రాలేక గల్ఫ్‌లో నరకయాతన అనుభవిస్తున్న ఏర్గట్ల గ్రామవాసి



లింగారెడ్డి కుటుంబీకులతో మాట్లాడుతున్న చాంద్‌పాషా

నవతెలంగాణ-ఏర్గట్ల

గంపెడు ఆశలతో తన కుటుంబాన్ని పోషించేందుకు గల్ఫ్ బాట పట్టిన ఏర్గట్ల మండలకేంద్రానికి చెందిన శెట్పల్లి లింగారెడ్డికి గల్ఫ్ దేశం పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. అయిన వారు కానరాక, పనిలేక, కాలు విరిగి నడవలేక, నిలబడలేక నరకయాతన అనుభవిస్తున్నాడు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలకేంద్రానికి చెందిన శెట్పల్లి లింగారెడ్డిది పేద కుటుంబం. కుటుంబాన్ని పోషించుకోవడానికి మొదట కువైట్ వెళ్ళడానికి చెన్నైకి చెందిన ట్రావెల్స్ ఏజెన్సీని సంప్రదించాడు. కానీ జగిత్యాల జిల్లా వర్షకొండ గ్రామానికి చెందిన రంజాని అనే ఏజెంట్ మోసగించి, కువైట్ వెళ్ళే లింగారెడ్డికి వద్ద నుండి 90 వేలు రూపాయలు తీసుకుని రెండేళ్ళ ఒప్పందంపై మలేషియాకు పంపారు. అప్పటి నుండి మలేషియాలో లింగారెడ్డికి పనిలేక, జీవనోపాధికోసం పొట్టచేత పట్టుకుని తిరుగుతూనే ఉన్నాడు. ఇదే క్రమంలో బస్సు ప్రమాదంలో కాలు దెబ్బతిని ఇన్‌ఫెక్షన్ రావడంతో నడవడం, నిలబడడం కష్టంగా మారింది. మలేసియా నుండి ఇండియాకు రావడానికి ఖర్చులు అధికంగా ఉండడంతో ప్రస్తుతం లింగారెడ్డి సహాయాన్ని అర్థిస్తున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్ కలిసి టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం ఆయన లింగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి సురక్షితంగా ఇంటికి రప్పిస్తామని కుటుంబ సభ్యులకు హామీనిచ్చారు. మాట ఇచ్చిన ప్రకారం ఎన్ఆర్ఐ సెల్ చిట్టి బాబు, భారత రాయబార కార్యాలయం, ముఖ్యమంత్రి కార్యాలయానికి ఈ విషయాన్ని చేరవేసినట్లు షేక్ చాంద్ పాషా తెలిపారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం భాధితుడికి సహాయం చేయాలని విన్నవిస్తామని అన్నారు. లింగారెడ్డిని ప్రభుత్వం సురక్షితంగా ఇంటికి రప్పించాలని బాధితుడి కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. చాంద్ పాషా వెంట డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, మోత్కూరి నవీన్ గౌడ్, నాయకులు గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి, శివన్నోళ్ళ రాజు, తదితరులు వెళ్ళి లింగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు.

మెరుగైన సేవలు అందించే లక్ష్యం


- ప్రారంభానికి సిద్ధమైన ఆనంద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన ఆనంద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గురువారం ప్రారంభించనున్నట్లు గోవింద్‌పేట్ అప్పాల ఆనంద్‌రెడ్డి తెలిపారు. వైద్య వృత్తి సమాజంలో చాలా పవిత్రమైందనే మాటను నిజం చేస్తూ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. వైద్యులు పీడియాట్రిక్ అరుణ్‌రెడ్డి, గైనకాలజిస్ట్ పూజారెడ్డి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా చికిత్సలు అందించేందుకు హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి
అప్పాల ఆనంద్‌రెడ్డి, గోవింద్ పేట్



జిల్లాలోని పరిసర ప్రాంతాల ప్రజలు మా వైద్య సేవలు అందుకోవాలి. అందరూ బాగుండాలి. ఆసుపత్రికి వచ్చే రోగులకు 24 గంటలు సేవలు అందిస్తాం.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్



నామినేషన్‌లో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్ట బద్రుల గొంతుక మెదక్-నిజామాబాద్ - ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి "అల్పోర్స్ విద్య సంస్థల అధినేత" డా. వూట్కూరి నరేందర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం సోమవారం కరీంనగర్లో జరిగింది. ఈ సందర్భంగా వారికి పెద్ద మొత్తంలో మద్దతుగా జిల్లా నుండి పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి వర్యులు ప్రస్తుత బోధన్ శాసన సభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియో లిటిల్ ఫ్లవర్‌లో సైన్స్ ఫెయిర్ ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంఈవో



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-నందిపేట్

రానున్న నేషనల్ సైన్స్‌డేని పురస్కరించుకొని మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సోమవారం కలాం ఇనిస్టూట్ ఆఫ్ యూత్ ఎక్సెలెంట్ వారి సహకారంతో డిఆర్‌డిఓ, ఇస్రోలలో తయారైన మిసైల్స్, సాటిలైట్స్, మంగల్‌యాన్, ఆర్యభట్ట, బ్రహ్మోస్, చంద్రయాన్, అస్త్ర ఇలా దాదాపు 20 మోడల్స్‌ను నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ప్రదర్శించినట్లు కరస్పాండెంట్ గోజురి అరుణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమన్ని మండల విద్య శాఖ అధికారి అవధూత గంగాధర్ ప్రారంభించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక భారతీయుడు సైంటిస్ట్ కావాలని ఉద్దేశంతో విద్యార్థి దశ నుంచి ఆలోచన విధానాన్ని అలవర్చుకోవాలని, డిఆర్‌డిఓ, ఇస్రో పనిగురించి విద్యార్థులకు వివరించారు. ఎక్కడో ఉన్న శ్రీహరి కోట, విక్రంసారబాయి లాంటి సెంటర్‌లను వెళ్లి సందర్శించాలి అంటే వ్యయప్రయాసలతో కూడిన పని అని, అలాంటిది ఇక్కడ మారుమూల ప్రాంత విద్యార్థులకు వాటి గురించి తెలుసుకునేలా చేసిన పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఇక ముందు ఎవయినా విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలకు పూర్తి సహకారం ఉంటుందని ఎంఈవో తెలిపారు. విద్యార్థుల మేధాశక్తిని ఆలోచనలను పెంచాలని రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారుడు డాక్టర్ సతీష్‌రెడ్డి స్ఫూర్తితో తెలంగాణలో వందరోజుల కార్యక్రమంలో భాగంగా నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. ఈ అవకాశాన్ని వివిధ ప్రభుత్వ ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల విద్యార్థులు, యువతి, యువకులు దాదాపు 1600 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని పాఠశాల కరస్పాండంట్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మ రాష్ట్ర సెక్రెటరీ రమేష్, నిజామాబాద్ రవి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సరళ మహేందర్ రెడ్డి, సాగర్, చిరంజీవి, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన పిట్లం విద్యార్థిని



నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న గొల్ల మహా లక్ష్మి కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఎల్బీనగర్ న్యూ ప్రోగ్రాం ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఆర్గనైజర్ పివి రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగవ అంతర్జాతీయ కరాటే, కుంగ్‌ఫూ పోటీలలో మండల కేంద్రానికి చెందిన బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనను కనబర్చారు. ఎనిమిదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న పిట్లం గ్రామానికి చెందిన గొల్ల మహాలక్ష్మి కరాటే పోటీల్లో విజయ పథంలో ఏకంగా గోల్డ్ మెడల్ సాధించి మండల, పాఠశాల కీర్తిని గడించారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఫైట్ మాస్టర్ శివ ప్రసాద్, మాస్టర్ రవిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు (మండల విద్యాధికారి) దేవిసింగ్ అందజేశారు.

షార్ట్‌పుట్‌లో విద్యార్థికి బంగారు పతకం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి లక్ష్మణ్ సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇందిరాగాంధీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన షార్ట్‌పుట్ అండర్ 16 క్రీడా విభాగంలో మొదటి స్థానం నుంచి బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో గెలుపొంది మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు..



- రోజుకోరకం దోపిడీ
- కామారెడ్డిలో పెరుగుతున్న మోసాలు
- పోలీసులు అవగాహన కల్పించినా.. కట్టడి కాని వైనం

నవతెలంగాణ-లింగంపేట్

బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఏటీఎం కార్డు నెంబర్లు, ఇతర వివరాలు అడిగి డబ్బులు కాజేసేవారు. లేదంటే లాటరీలో మీరు బహుమతులు గెలుచుకున్నారని, బహుమతులకు ఎంపికయ్యారని మాయమాటలు చెప్పి బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసేవారు. ఫేస్‌బుక్, ఫోన్‌పే, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సామాజిక మధ్యమాలలో ఉన్నవారిని తేలిగ్గా ప్రభావం పెడుతున్నారు. వీటివలలో పడినవారు ఆర్థికంగా నష్టపోయి మానసికంగా కృంగిపోతున్నారు. ఇదే తరహాలో గత మూడు నెలల క్రితం కామారెడ్డి పట్టణానికి చెందిన కిషన్ అనే వ్యక్తికి సైబర్ నేరగాల్లు ఫోన్ చేసి 9 లక్షల 29 వేలను కాజేసిన ఘటన జిల్లా కేంద్రంలో తీవ్ర కలకలం రేపింది. గతంలో కలెక్టరేట్లోని పలు జిల్లాస్థాయి అధికారులమని ఏసిబి అధికారులు అంటూ బెదిరింపు కాల్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన ఘటన చోటుచేసుకుంది. అలాగే కామారెడ్డి పట్టణానికి చెందిన వ్యక్తికి గత నాలుగు నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి 'మేము ఢిల్లీ నుంచి పోలీసులం మాట్లాడుతున్నాం. నువ్వు డ్రగ్స్ కేసు మనీ లాండరింగ్ కేసులో ఉన్నావు. ఢిల్లీ పోలీసులు నిన్ను పట్టుకునేందుకు వస్తున్నారు.' అంటూ ఫోన్‌లో బెదిరించారు. మరుసటి రోజు అదే నెంబర్ నుంచి ఫోన్ చేసి నిన్ను అరెస్టు చేయకుండా ఉండాలంటే అకౌంట్‌లో డబ్బులు పంపాలని డిమాండ్ చేశారు. దీంతో సదరు వ్యక్తి భయభ్రాంతులకు గురై 9 లక్షల 29 వేలు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆ తర్వాత మోసపోయినట్టు గమనించి బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

లింగంపేట్ మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందిన వ్యక్తికి రూ.50 వేలు కడితే ట్రాక్టర్ ఇస్తామని నమ్మించి లక్ష 50 వేల రూపాయలు కాజేశారు. తిరిగి వారి నెంబర్లకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ కావడంతో పోలీసులను ఆశ్రయించారు. కామారెడ్డి మండలంలోని శాబ్దిపూర్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ మహిళ ఎంప్లాయ్‌కి డిటిపిఎస్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామని ఈ కొరియర్‌కు డియాక్టివ్ అయిందని యాక్టివ్ చేయడానికి ఒక లింకు పంపిస్తామని ఆ లింకు రూ.5000 పంపిస్తామని తెలపడంతో సదర్ మహిళ లింకును ఓపెన్ చేసి 5000 రూపాయలు పంపించారు. ఆ తర్వాత 71300 ఆమె బ్యాంకులో ఉన్న ఖాతా నుంచి కాజేశారు. అదే గ్రామానికి చెందిన ఒక ప్రైవేటు ఉద్యోగి ఇన్‌స్టాగ్రాములో రూ.5000 పెట్టుబడి పెడితే 18,000 వస్తాయని మెసేజ్ పెట్టడంతో ఆశకు గురైన ఆ ప్రైవేటు ఉద్యోగి రూ.5000 పంపించాడు. మరుసటి రోజు ఆయన ఖాతాలో 48 వేలు గెలుచుకున్నాడు. డబ్బులు మీ ఖాతాలో పడాలంటే మరో 10 వేలు పంపించాలని చెప్పారు. దీంతో మరో పదివేల రూపాయలు పంపించడంతో సదరు వ్యక్తులు స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

> రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతోంది. సైబర్ నేరాలు సైతం అదే స్థాయిలో అధికమవుతున్నాయి. దీంతో సైబర్ నేరగాళ్ల రెచ్చిపోతున్నారు. స్మార్ట్‌ఫోన్లను మామూలు ప్రజల నుంచి అందరూ ఉపయోగిస్తున్నారు. నిత్యం ఏదో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం అలవాటుగా మారింది. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్ల రోజుకోరకంగా దోచుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నాం. కళాశాలల్లో, ఆయా గ్రామాల్లో రైతులకు, మారుమూల ప్రాంతాల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. గుర్తు లేని వ్యక్తులు ఫోన్ చేస్తే సమాచారం ఇవ్వవద్దు. **- శ్రీనివాస్, డీఎస్పీ ఎల్లారెడ్డి**

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రానికి చెందిన రిటైర్డ్ విద్యుత్ లైన్మెన్ సిద్దయ్య ఇటీవల కాలంలో మరణించారు. విషయం తెలుసుకున్న పట్టణ అఖిలపక్ష నాయకులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భూమయ్య, సొసైటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ వేణు, నాయకులు ఆంజనేయులు, సుబ్బారావు, సాయిలు, మల్లేశం, గంగారాం, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ శివాలయం కార్యనిర్వాహణాధికారిగా రాములు

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఏకచక్రేశ్వర శివ మందిరం కార్యనిర్వహణాధికారిగా రాములు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ హరికాంత్‌చారి, ధర్మకర్తలు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పట్టణ ప్రముఖులు, పెద్దలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఆలయ పూజారులు గణేష్ మహారాజ్, మహేష్ పంతులు పూలదండలు వేసి సన్మానించారు.

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి ప్రాథమిక సహకార సంఘంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు కార్యదర్శి దేవేందర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కందులు క్వింటాకు రూ.7550 ధర ఉన్నట్టు తెలిపారు. ఒక ఎకరానికి మూడు క్వింటాళ్ల 30 కిలోలు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కందులలో 12 తేమ శాతం ఉండాలన్నారు. కందులు తెచ్చేవారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. కందులలో చెత్తాచెదారం లేకుండా తీసుకురావాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సమాచార హక్కు చట్టం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేగ్గేల రాజు మాట్లాడుతూ.. తాడ్వాయి మండలం బ్రహ్మజీవాడిలో దళితుడు అయిన రమేష్ గుడిలోకి వచ్చాడని, దళితుడు అనే కారణంతో విచారణ నిమిత్తం వచ్చిన కమిషన్ వెంటనే ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసే విధంగా చూడాలని కోరారు. వివిధ అధికారులు అట్రాసిటీ కేసు నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, రమేష్‌కు తగిన న్యాయం చేయాలని వారన్నారు. అదేవిధంగా లింగంపేట్ మండల కేంద్రానికి సంబంధించిన ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల కామారెడ్డి దేవునిపల్లిలో ఉందని, దానిని లింగంపేట్ వచ్చే విధంగా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి లేగ్గేల రాజు, అంబేద్కర్ సంఘం మండల ఉపాధ్యక్షులు భూపతి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నెల్లూరి గంగారాం, గణేష్, అశోక్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందేలా చూస్తాం

- ఎండిన పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందక రైతులు ఆందోళన చేయడంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు బీర్కూర్ మండలంలోని దామరంచ కిష్టాపూర్ నసురుల్లాబాద్ మండలంలోని మీర్జాపూర్ తదితర గ్రామాలలో ఉన్న పంట పొలాలను వ్యవసాయ శాఖ బృందం పరిశీలించింది. నిజాంసాగర్ ప్రాజెక్టు 25వ డిస్ట్రిబూటర్ కాలువ ద్వారా మీర్జాపూర్ దామారంచా కిష్టాపూర్ గ్రామాల్లో ఉన్న చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందకపోవడంతో గత వారం రోజుల నుండి రైతులు ఆందోళన చెందడంతో జిల్లా కలెక్టర్ స్పందించి రైతు సమస్యలను తెలుసుకొని నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ వివిధ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ పంట పొలాలకు సాగునీరు అందేలా కృషి చేస్తామని రైతులకు భరోసా కల్పించారు. పలు గ్రామ రైతులు మాట్లాడుతూ చివరి ఆయకట్టు పంట పొలాలకు సాగునీరు అందించాలని, సాగునీటి కాలువల్లో అడ్డంకులను తొలగించాలన్నారు. ఎండాకాలం సాగునీటి కాలువ ల్లో ముళ్లపొదలు పెరగడం, రాళ్ల ఉండడంతో సాగునీరు రావడం లేదని అన్నారు. కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వీరి వెంట బాన్సువాడ ఏడిఏ అరుణ, మండల వ్యవసాధికారిణి భవాని , ఏఈఓ గోపాల్ ,సాయి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో గంగపుత్ర సంఘ భవనం నిర్మాణానికి బిజెపి నాయకులు సోమవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఇంచార్జ్ శ్రీధర్ రెడ్డి భూమి పూజ నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, గ్రామ అధ్యక్షుడు నరేందర్, ప్రమీల, పావని, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రాములు, ఎల్లయ్య, శ్రీను, గంగపుత్ర సంఘం సభ్యులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న దృశ్యం

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో సోమవారం మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చిన్న చంద్రం, ఉపాధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి కుమార్, కోశాధికారి రాజు, సహాయ కోశాధికారి ప్రవీణ్, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రజాసంఘాల మహాధర్నాలో కామారెడ్డి జిల్లా నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహించినట్టు కామారెడ్డి సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఈ మహా ధర్నాలో రాష్ట్ర నలుమూలల నుండి కార్మికులు, కర్షకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడా బాబులకు తప్ప పేదలకు కాదని నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. ఈ ధర్నాలో కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్‌వెస్లీ, ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారని వివరించారు. అలాగే కామారెడ్డి సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్‌తో పాటు జిల్లా నుంచి 100 మంది పాల్గొన్నారు.


మహాధర్నాలో పాల్గొన్న నాయకులు

కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జాన్కంపేట్ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వేద పురోహితుల మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. అంతకుముందువా శ్రీ లక్ష్మీనర సింహస్వామి విగ్రహ మూర్తులను పల్లకి సేవలో ఆలయంలో ఊరేగింపు నిర్వహించి.. అనంతరం కళ్యాణ మండపంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ప్రజల సౌకర్యం మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సకల సౌకర్యాలతో పాటు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గింజపల్లి వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం..

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొనసాగుతున్న జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి విగ్రహమూర్తులతో మంత్రోచ్చారణాల మధ్య స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధికారి గింజుపల్లి వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు తెలిపారు. ఆలయ కమిటీ ఆవరణంలో, అష్టముఖి కోనేరు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రజలు

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీలు : ఎస్ఐ వంశీకృష్ణారెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలను నిర్వహించారు. బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఎడపల్లి మండల కేంద్రం ఉండడంతో పాటు నిత్యం ప్రమాదాలు జరగకుండా పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. త్రిబుల్ రైడింగ్‌తో పాటు, లైసెన్సు లేకుండా వాహనాలు నడిపే వాహనదారులపై, అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయనున్నట్టు ఆయన వాహనదారులను హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని ఆయన అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బాన్సువాడ నుంచి గాంధారి మీదుగా హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించండి

నవతెలంగాణ-గాంధారి

గత 20 సంవత్సరాలుగా బాన్సువాడ వయా గాంధారి హైదరాబాద్‌కు ఉదయం ఐదు గంటలకు బస్సు సౌకర్యం ఉండేదని.. దసరా పండుగ నుంచి బస్సు రద్దు చేయడంతో మండల ప్రజలకు తీవ ఇబ్బందులు అవుతున్నాయని బస్సు సౌకర్యాన్ని పునర్ధించాలని బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సరితాదేవికి ఏబీవీపీ పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలుక సుమన్ వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గండివేట్ గ్రామానికి సాయంత్రం 5 గంటలకు బాన్సువాడ నుంచి గండివేట్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, అలాగే బాన్సువాడ నుంచి గాంధారి మీదుగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు కూడా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులుక, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తక్షణమే స్పందించి మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్ ఎంట్రీ సక్రమంగా నిర్వహించాలి

- డిపిఎం సుధాకర్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఆన్లైన్ ఎంట్రీ సక్రమంగా నిర్వహించాలని డిపిఎం సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని డిపిఎం సుధాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య లావాదేవీలు ఆన్లైన్‌లో ఎంట్రీ చేసే విధానంపై అకౌంటెంట్ రాజుకు అవగాహన కల్పించారు. ఆన్లైన్ ఎంట్రీ సక్రమంగా నిర్వహించాలని ఆయన అన్నారు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఆన్లైన్లో తప్పులు లేకుండా అన్ని లావాదేవీలు ఎంట్రీ చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏపిఎం జగదీష్ ఉన్నారు.


మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్

నేడు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జైతాపూర్ గ్రామంలో కరటూరి పాపారావు పకృతి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు వ్యవసాయంపై అవగాహనా సదస్సు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు మంగళ్‌పహాడ్ మాజీ ఎంపీటీసీ అరుగుల వనజ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ వారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయి అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 11న (మంగళవారం) జైతాపూర్ గ్రామంలో కరటూరి పాపారావు వ్యవసాయ క్షేత్రంలో ఉదయం 10.30 నిమిషాలకు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

గ్రామ సంఘాల అంతర్గత ఆడిట్ ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల మండల సమాఖ్య కార్యాలయంలో 12 గ్రామ సంఘాల అంతర్గత ఆడిట్ నిర్వహిస్తున్నట్టు జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో సీబీఓ ఆడిటర్ వడ్ల కుమార్, అకౌంటెంట్ రాజు, వివిధ గ్రామాల వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

**NOTICE TO SHOW CAUSE
IN THE COURT OF THE
HON'BLE PRL. DIST.. JUDGE
AT: NIZAMABAD.
I.A.NO: 509 of 2024
IN
CMA No. of 2025**

Between:-
Pathloth Lalitha.
..Petitioner/appellant
And
Pathloth Devender & others
...Respondents/Respondents

To,
R1: Pathloth Devender s/o. late Sangya Naik age 40 Yers, Occ:Business R/o.H.no 11-1-1210, Chandrashekar colony, Nizamabad
R4: Amgoth shankar Naik s/o mothising, age 38yers Occ: Lineman, R/o H.No: 11-1-89. Vidhyathnagar, Armoor road Nizamabad.

Whereas the above named petitioner has made an application U/s 5 of Limitation Act before this Hon'ble Court against you and same was posted for your appearance & hearing on **17-02-2025.**

Take notice that in the above case, if any objections or claims for above CMA, you are directed to appear before this Hon'ble court on **17-02-2025 at 10.30 A.m** either in person or through a Counsel duly authorized, failing which the above Subjected matter willl be heard and decided as per law.

// BY ORDER OF THE COURT //
E.Bhagee Charan
Advocate, Nizamabad

**IN THE COURT OF THE
HON'BLE PRL. JUNIOR CIVIL
JUDGE AT:: NIZAMABAD.
O.S. No.159 of 2023**

Between:-
Tagilapally Srinivas
..Plaintiff
and
Gudla Vijay Prakash & others
..Defendants

Notice

To,
Smt. Karchalkar Sandhya W/o K. Prakash Rao, Aged: 72years, Occ:Housewife, R/o H.no.5-4-102, Saraswathi Nagar, Nizamabad.
Smt. Karchalkar Sandhya, W/o k.prakash rao (Defendant No-3),72 yrs, H.no:5-330, S.R.Naik Nagar, Quthbullapur mandal, Rangareddy Dist, T.S-500055.

whereas the above named petitioner filed the above case against you, for partition & separate possession, declare sale deeds: 7027/2019, AGPA 2073/2013 as null & void, Please take notice that the case stands posted on Dt: **18/02/2025** for your appearance. You are required to appear before Honble Court on Dt:**18/02/2025, at 10:30 A.M** in person or through Advocate, failing which the matter will be heard and decided in your absence.

// BY ORDER OF THE Honble Court //
J. VENKATESHWAR,
Advocate,
H. No.6-52, Venkateshwara Colony, Arya Nagar, Nizamabad,
Cell:90304 01114